పతకాలు గెలిచిన నడకలివి..!

ప్రతి అడుగు పతి అడుగై జాతీయ కీర్తి పథాన వరలక్ష్మి

అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న వైనం

ఆమె భర్త అడుగుజాడల్లో నడిచింది..ఆ నడక జాతీయ స్థాయికి తీసుకువెళ్లింది. పతకాల పంట సాధించేలా చేసింది. భార్య విజయానికి భర్త చూపిన బాట పూలబాట అయింది. అథ్లెటిక్‌గా విశేషంగా రాణిస్తోంది. ఓ సాధారణ గృహిణి నాలుగు గోడల మధ్యే ఉండిపోకుండా భర్త ప్రోత్సాహంతో దేశం నలుమూలలా తన ప్రతిభను చాటుకుంటోంది. ఆ గృహిణి పేరు వరలక్ష్మి.. ఉంటుంది ఉక్కునగరంలో.. ఆమె విజయ ప్రస్థానం తెలుసుకుందాం.



జాతీయ పతకం అందుకుంటున్న వరలక్ష్మి



పరుగు పోటీలో పాల్గొన్న వరలక్ష్మి

జాతీయ స్థాయిలో పతకాలు

- 2020లో హర్యానాలోని పంచకులలో జరిగిన 5 కి.మీ నడక పోటీలో కాంస్య పతకం
- 2020లో హర్యానాలోని పంచకులలో జరిగిన 10 కి.మీ పరుగు పోటీలో కాంస్య పతకం
- 2021లో ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరిగిన 5 కి.మీ నడక పోటీలో కాంస్య పతకం
- 2021లో ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరిగిన 10 కి.మీ పరుగు పోటీలో రజత పతకం
- 2023లో హర్యానాలోని కురుక్షేత్రలో జరిగిన 5 కి.మీ నడక పోటీల్లో బంగారు పతకం
- 2023లో హర్యానాలోని కురుక్షేత్రలో జరిగిన 10 కి.మీ పరుగు పోటీలో రజత పతకం
- 2024లో హైదరాబాద్‌లో జరిగిన 5 కి.మీ నడక పోటీలో రజత పతకం
- 2024లో హైదరాబాద్‌లో జరిగిన 10 కి.మీ పరుగు పోటీలో కాంస్య పతకం
- 2025లో కేరళలోని త్రిశూర్‌లో జరిగిన 5 కి.మీ నడక పోటీలో బంగారు పతకం
- 2025లో కేరళలోని త్రిశూర్‌లో జరిగిన 5 కి.మీ, 10 కి.మీ పరుగు పోటీల్లో కాంస్య పతకాలు



యోగా వరల్డ్ రికార్డు అందుకుంటున్న వరలక్ష్మి

ఉక్కునగరం : ఆమె సాధారణ గృహిణి. భర్త వాకింగ్ వెళ్తే వెంట వెళ్లేది. ఆ నడకే ఆమెను జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో మెడల్స్ సాధించే స్థాయికి తీసుకెళ్లింది. స్టీల్‌ప్లాంట్ మీడియం మర్చంట్ అండ్ స్ట్రక్చరల్ మిల్ (ఎం.ఎం.ఎస్.ఎం) విభాగంలో సీనియర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న కోరెడ్డి సత్యనారాయణ టౌన్‌షిప్‌లోని సెక్టార్–10లో కుటుంబంతో నివశిస్తున్నారు. ఆయన భార్య వరలక్ష్మి గృహిణి కాగా వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సత్యనారాయణ ఉక్కు స్టేడియంలో రోజూ వాకింగ్‌కు వెళ్తుంటారు. కొన్నాళ్లకు ఆమెను కూడా వాకింగ్‌కు తీసుకువెళ్లడం ప్రారంభించారు. అలా వాకింగ్ వెళ్తున్న వరలక్ష్మిని మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు చెందిన వెంకటాద్రి పోటీల్లో పాల్గొవాలని సూచించారు. 2018లో మొదటసారిగా ఆమె జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నారు. అక్కడ ఆమె సాధించిన విజయాలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేలా చేశాయి. 2018లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 35+ కేటగిరీలో ఆమె 5 కిలోమీటర్ల నడక, 5 కి.మీ పరుగులు, 1,500 మీటర్ల పరుగు పోటీల్లో పాల్గొని మూడు ఈవెంట్లలో బంగారు పతకాలు సాధించారు. ఆ ఏడాది న్యూఢిల్లీలో జరిగిన జాతీయ పోటీల్లో పాల్గొన్న వరలక్ష్మి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ సాధించారు. అప్పటి నుంచి 2025 వరకు జరిగిన అన్ని రాష్ట్ర స్థాయి పోటీల్లోను పాల్గొంటూనే ఉన్నారు. ప్రతి పోటీల్లోను ఆమె బంగారు పతకాలు సాధిస్తూనే ఉన్నారు.

యోగాలో ప్రపంచ రికార్డ్



అథ్లెటిక్స్ పోటీల్లో పతకాల వేట కొనసాగిస్తున్న వరలక్ష్మి ఆరునెలలుగా యోగా అభ్యసిస్తున్నారు. బెంగళూరుకు గ్లోబల్ వరల్డ్ రికార్డ్, యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ఆధ్వర్యంలో నగరంలోని నేచర్ క్యూర్ హాస్పిటల్‌లో యోగాసనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వరలక్ష్మి 'గర్భాసనం' పోటీలో పాల్గొని గంట పాటు ఆ ఆసనం వేసి గత రికార్డ్ 35 నిమిషాలను అధిగమించి వరల్డ్ రికార్డ్ సాధించారు. యోగా గురువులు చేతుల మీదుగా వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందుకున్నారు.

నడక, యోగాతో ఆరోగ్యం

నడక ప్రారంభించిన తర్వాత ఆరోగ్య సమస్యలు లేకుండా పోయాయి. అదే విధంగా యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందింది. తాను నడక, యోగా ప్రారంభించిన తర్వాత నా చుట్టూ ఉన్నవాళ్లు చాలా మంది నన్ను అనుసరించారు. మిగిలిన వారు నడక, యోగా చేయడం ద్వారా వారి ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఆశిస్తున్నాను. అటు అథ్లెటిక్స్‌లో.. ఇటు యోగా రాణిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. భర్త ప్రోత్సాహం మరువలేను.

– కోరెడ్డి వరలక్ష్మి

క్లుప్తంగా

త్రిశక్తి దేవాలయంలో కల్యాణ మాతంగి పూజలు



విశేషాలంకరణలో మహాదుర్గ అమ్మవారు

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ త్రిశక్తి దేవాలయంలో గురువారం కల్యాణ మాతంగి పూజలు చేశారు. ఆలయంలో జరుగుతున్న శ్యామలా (గుప్త) నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివాహ కార్యాలు, అన్యోన్య దాంపత్యం కోసం అమ్మవార్లకు పూజలు చేశారు. అంతకు ముందు వేకువజామున ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో శ్రీమహాదుర్గ, మహాసరస్వతి విశేషంగా అలంకరించారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి

గాజువాక : గంగవరం గ్రామంలో శుక్రవారం నుంచ వారం రోజులు నిర్వహించనున్న జిల్లా స్థాయి విండ్‌బాల్ క్రికెట్ పోటీల పోస్టర్‌ను కిక్ బాక్సింగ్ సంఘం గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్ లెవన్ క్రికెట్ లీగ్ సీజన్–2 పేరుతో నిర్వహించనున్న ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30 వేలు, ద్వితీయ స్థానం సాధించిన టీమ్‌కు రూ.20 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేలు బహుమతులతోపాటు ట్రోఫీలను అందజేయనున్నట్టు తెలిపారు. వీటితోపాటు బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మన్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకుడు రాజు, ప్రతినిధులు పి.పాల్రాజు, జి.సతీష్, నాగేంద్ర, కార్తీక్, ధనరాజు, శ్రీను, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక హైస్కూల్ విద్యార్థికి నంది అవార్డు



నంది అవార్డు, సన్మాన పత్రంతో ప్రణీత్ కుమార్

గాజువాక : గాజువాక హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న కలివరపు ప్రణీత్ కుమార్‌కు తెలుగు వెలుగు సాహితీ వేదిక నంది అవార్డును ప్రదానం చేసింది. కీబోర్డు ప్లే, గానం, చిత్రకళారంగంలో నైపుణ్యం ప్రదర్శిస్తున్నందుకుగాను ఈ అవార్డును అందజేశారు. విజయవాడలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు–2025లో ప్రణీత్ కుమార్‌కు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.విజయప్రశాంతి, ఉపాధ్యాయులు అవార్డు గ్రహీతను అభినందించారు.

పేదలకు చీరల పంపిణీ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పెదగంట్యాడ : జీవీఎంసీ 72వ వార్డు పరిధి సమతానగర్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. రోటరీ ఫ్రీ హోమియో క్లినిక్ నేతృత్వంలో జరిగిన ఈ శిబిరంలో అంధులకు స్మార్ట్ విజన్ కళ్లజోళ్లు పంపిణీ చేశారు. క్లినిక్ చైర్మన్ దివంగత విక్టర్‌రాజ్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు కళ్లజోళ్ల పంపిణీకి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి క్లబ్ ఉపాధ్యక్షుడు సీరట్ల శ్రీనివాస్ అంధులకు కళ్లద్దాలతో పాటు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, హేమంత్, లక్ష్మణరావు, వెంకటరావు, యోగ సభ్యులు విజయ్, వినోద్, విజేత తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌డీసీ నూతన విభాగాధిపతికి అభినందనలు



స్టీల్‌ప్లాంట్ ఎల్‌డీసీ నూతన విభాగాధిపతి ఠాగూర్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎల్‌డీసీ) విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన జనరల్ మేనేజర్ టీకేఎస్‌ఆర్ ఠాగూర్‌ను ఎల్‌అండ్‌డీసీ అధికారులు, కార్మికులు అభినందించారు. ప్రస్తుతం హెచ్‌ఆర్‌డీ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఠాగూర్‌కు హెచ్‌ఆర్‌డీతో పాటు ఎల్‌డీసీకి కూడా విభాగాధిపతిగా నియమించారు. గురువారం ఠాగూర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విభాగం సమస్యలు, చేయాల్సిన కార్యక్రమాలపై ఉద్యోగులతో చర్చించారు. కార్యక్రమంలో విభాగం డీజీఎం సీహెచ్. సోమయాజులు, అధికారులు గణేష్‌బాబు, రాజేష్ వర్మ, కేఎల్‌ఎస్ కుమారి, ఉద్యోగులు వి.శ్రీనివాసరావు, డి. కృష్ణారావు, ఎం.నాగేశ్వరరావు, ఎ.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై ప్రభుత్వాల వివక్ష



దీక్ష శిబిరంలో సీటు నాయకులు

కూర్మన్నపాలెం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు కర్మాగారంపై వివక్ష చూపుతున్నాయని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ రామారావు ఆరోపించారు. ఉక్కు పరిరక్షణ పోరాట సమితి కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో గురువారం ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆందోళకారులను ఉద్దేశించి మాట్లాడుతూ కర్మాగారం విషయంలో కేంద్ర మంత్రులే పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. శిబిరంలో సీటు నాయకులు కె.గంగాధర్, విజయకుమార్, సత్యన్నారాయణ, జగ్గారావు, భానుమూర్తి, వెంకటేశ్వరరావు, అప్పారావు తదితరుల పాల్గొన్నారు.

నిరుపేద అంధుడికి 'సత్యసాయి కుటీర్'



అప్పారావుకు ఇంటిని అప్పగిస్తున్న జిల్లా అధ్యక్షుడు నాయుడు



సత్యసాయి కుటీర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి నిరుపేద అంధుడికి భారీ కానుక అందజేసింది. పేద గుడిసెలో ఉండే ఆ కుటుంబానికి సత్యసాయి కుటీర్ పేరిట ఇంటిని నిర్మించి అప్పగించింది. సత్యసాయి సేవా సమితి తమ దత్తత గ్రామాలైన నమ్మిదొడ్డి, యలమంచిలిదొడ్డి గ్రామాల్లో పలు సేవా కార్యక్రాలు నిర్వహిస్తోంది. సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా యలమంచిలిదొడ్డికి చెందిన అంధుడు వనమా అప్పారావు కుటుంబం పాకలో ఉండేది. సత్యసాయి సమితి పాక స్థానంలో ఇంటిని నిర్మించగా యువజన సమన్వయకర్త కె. ప్రకాశ్ నేతృత్వంలో సత్యసాయి యువత, సేవాదళ్ ఎలక్ట్రికల్, పెయింటింగ్, కార్పెంటర్ పనులు పూర్తి చేశారు. గురువారం సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎన్. నాయుడు ఇంటిని ప్రారంభించి అప్పారావుకు అందజేశారు. ఈ సందర్భంగా అప్పారావు కుటుంబానికి కొత్త బట్టలు, నెలకు సరిపడేలా కిరాణా సామగ్రి అందజేశారు. మరో 10 మంది పేద వితంతువుల కుటుంబాలకు అమృతకలశాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్తలు ఆర్.ఎ. నాయుడు, సాయి కుమార్, ఎం. ఈశ్వరరావు, సమితి కన్వీనర్ జి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి అభిమానికి ఆర్థిక సాయం



చాట్ల శంకర రెడ్డికి ఆర్థిక సహాయం అందజేస్తున్న అఖిలభారత స్టేట్ చిరంజీవి ఫ్యాన్స్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఇటీవల అనారోగ్యానికి గురైన చిరంజీవి అభిమాని చాట్ల శంకర రెడ్డికి స్టేట్ చిరంజీవి ఫ్యాన్స్ ప్రతినిధులు ఆర్థిక సహాయం అందజేశారు. గురువారం 69వ వార్డు తుంగ్లాంలో ఆయన నివాసంలో అఖిలభారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు వరణం స్వామి నాయుడు, కోయిలాడ శ్రీనివాసరావుల ఆదేశాల మేరకు స్టేట్ చిరంజీవి ఫ్యాన్స్, గాజువాక చిరంజీవి ఫ్యాన్స్ ప్రతినిధులు ఆయన నివాసంలో లక్ష రూపాయలకు పైగా ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం ప్రతినిధులు టి.శ్రీనివాసరావు, బాలాజీ రెడ్డి, గాజువాక ఫ్యాన్స్ ఎం.దేముడు, పి.వెంకటరమణ, పి.ఎస్.ఆనంద్, జే.రవి, పల్లా కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

జూలో ఎలుగుబంటి ఎన్‌క్లోజర్ పునర్నిర్మాణం



జూలో నిర్మిస్తున్న ఎలుగు బంటి ఎన్‌క్లోజరు

ఆరిలోవ : ఇందిరా గాంధీ జూ పార్కులో ఎలుగుబంట్ల ఎన్‌క్లోజర్‌ను అధికారులు పునర్నిర్మిస్తున్నారు. ఇందుకోసం కొద్ది రోజులుగా పనులు జరుపుతున్నారు. జూలో ఎలుగుబంటి ఎన్‌క్లోజర్లు మూడు ఉన్నాయి. వాటిలో సింహాల ఎన్‌క్లోజరు పక్కన ఉన్న ఎన్‌క్లోజరు సుమారు పదేళ్ల క్రితం శిథిలావస్థకు చేరింది. ఇందులో డేక్రాల్‌తోపాటు నైట్ క్రాల్ కూడా శిథిలమయ్యాయి. దీంతో జూ అధికారులు అందులోని ఎలుగుబంట్లను వేరే ఎన్‌క్లోజరులోకి తరలించి దాన్ని ఖాళీ చేయించారు. సుమారు పదేళ్లుగా ఖాళీగా ఉండటంతో మొక్కలు దట్టంగా పెరిగిపోయి అస్తవ్యస్తంగా మారింది. ఇప్పుడు మళ్లీ దానికి మోక్షం కలిగింది.

భద్రం బీ కేర్‌ఫుల్ బ్రదరూ..



ద్విచక్రవాహన చోదకులు శిరస్త్రాణం ధరించడం తప్పనిసరి. రోడ్డు ప్రమాదాలు జరిగినా, సురక్షితంగా బయటపడాలంటే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే, ప్రజలు కొన్ని సందర్భాలలో పోలీసుల మాటలు పెడచెవిన పెట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు. నగరంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి తన హెల్మెట్‌ను చిన్నారికి పెట్టారు. చిన్నారి భద్రతకు ప్రాధాన్యం ఇచ్చిన ఆయన తన భద్రతను మాత్రం గాలికి వదిలేశారు. ద్విచక్ర వాహన చోదకులు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ట్రాఫిక్ నియమాలను పాటించాల్సిన అవసరం ఉంది. ప్రతీ వ్యక్తి వెనుక, ఒక కుటుంబం ఆధారపడి ఉంటుందనే వాస్తవాన్ని గుర్తించి, జాగ్రత్తలు పాటించాలి.

– ఏయూక్యాంపస్

గుర్తింపు యూనియన్ నాయకుల నిలదీత

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) డేట్ ఆఫ్ జాయినింగ్ ప్రకారం జీతాలు చెల్లింపుపై గుర్తింపు యూనియన్ ప్రతినిధులు పలువురు ఉద్యోగులు నిలదీశారు. ఉద్యోగుల తరుపున యూనియన్‌కు మద్దతుదారులైన త్రిఫ్ట్ సొసైటీ డైరెక్టర్లు గోవిందరావు, కేఎన్‌వీ ప్రసాద్ వీరికి బాసటగా నిలవడం విశేషం. ఆర్ సిరీస్ పేరుతో పర్మినెంట్ అయిన తర్వాత డేట్ ఆఫ్ జాయినింగ్ సరిగా లేనందున చాలా మంది ఉద్యోగులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోలేదని తెలిపారు. 1992 నుంచి డేట్ ఆఫ్ జాయినింగ్ సరి చేయాలని, దీనివల్ల ఉద్యోగులకు ఆర్థికంగా నష్టం జరుగుతుందని నిలదీశారు. గుర్తింపు యూనియన్ స్పందిస్తూ ఈ అంశంపై 10–15రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారం కాకుంటే ఆందోళన చేస్తామని గుర్తింపు యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు హెచ్చరించారు.

నేడు కంటి వైద్య శిబిరం

కూర్మన్నపాలెం : స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. రామాలయం ఆవరణలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్షలు చేయనునట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్లాలు పొరలు ఉన్నవారికి డా౹౹ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేపడతామని వారు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వాసన్ ఐకేర్ ఆస్పత్రి యాజమాన్యం కోరింది.

కార్పొరేట్ విద్యా వ్యవస్థను నిరోధించండి

ఏయూ క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కార్పొరేట్ విద్య వ్యవస్థను నిరోధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవింద రావు న్యూఢిల్లీలో కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఏపీలో విద్య హక్కు చట్టం – 2009ని పూర్తి స్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ



విద్యార్థినికి కళ్లద్దాలు అందజేస్తున్న కోరమాండల్ డీజీఎం శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: కొద్ది రోజుల క్రితం జీవీఎంసీ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 90 మందికి కళ్ల అద్దాలు అవసరమయ్యాయి. గురువారం ఆ 90 మంది విద్యార్థులకు సంస్థ డీజీఎం (హెచ్‌ఆర్) ఆర్.శ్రీనివాసరావు కళ్ల అద్దాలు అందజేశారు. అలాగే కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆర్థిక సహాయంలో స్కూల్లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ భవన నిర్మాణానికి సంస్థ అధికారులు, స్కూల్ హెచ్ఎం ఆంజనేయతో కలిసి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో కోరమండల్ ఏజీఎం (ఈహెచ్ఎస్) నాగరాజు, డిప్యూటీ మేనేజర్ వెంకటరమణ, సీఎస్ఆర్ ప్రతినిధి రాజీవ్, కుమారి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలువలు శిథిలం



పొదలు, తుప్పలతో ప్రధాన కాలువ దుస్థితి



కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

కూర్మన్నపాలెం : రహదారికి ఇరువులా కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కూర్మన్నపాలెం జాతీయ రహదారి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే మెయిన్‌రోడ్డుకు రెండు వైపులా కాలువలు పూర్తిగా మరమ్మతులకు గురయ్యాయి. వీంతో మురుగు పారడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతుండడంతో ఈ ప్రాంతీయులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆరు నెలల క్రితం ఈ ప్రాంతంలో పైపులైను వేస్తామని రహదారికి ఇరువైపులా గోతులు తవ్వారు. పైపులైనులు వేయక పోగా..ఆ గోతులూ పూడ్చలేదు. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే కాలువాలకు ఆనుకుని ఉన్న షాపులకు వచ్చే వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలకు మరమ్మతులు చేసి, రహదారులపై గోతులను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి శ్రీకృష్ణ బాయ్స్ హాస్టల్ (పీజీ)లో బుధవారం రాత్రి వెలిగండ్ల కార్తీక్ రాజు (22) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కడప జిల్లా బద్వేల్ మండలంలోని వెంకటసెట్టిపల్లి దరి రాజుపాలెంకు చెందిన కార్తీక్ రాజు గతంలో విజయనగరంలోని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కోర్సు పూర్తి చేశాడు. అనంతరం విశాఖలోని ఓ కంపెనీలో జాబ్ కోసం ఇంటర్వ్యూకి కూడా వెళ్లాడు. అనంతరం తిరిగి ఊరు వెళ్లిపోయాడు. ఇటీవల ఉద్యోగంలో చేరమని ఫోన్ రావడంతో నగరంలోని మైక్రోగ్రిడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో జనవరి 31న చేరాడు. ప్రస్తుతం ఎంవీపీ కాలనీ అప్పుఘర్‌లోని శ్రీకృష్ణ బాయ్స్ హాస్టల్ (పీజీ)లో ఉంటూ ఉద్యోగానికి వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి రూమ్‌లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అర్ధరాత్రి రూమ్ సభ్యులు కిటికిలో నుంచి చూసి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదని పోలీసులు తెలిపారు.